ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 15 మే 2025 | 5





మానేపల్లిలంకలో నీరు బయటకు వచ్చేలా లోతుగా జరిపిన తవ్వకాలు



ఏలేశ్వరంలో క్వారీలు

గుంజేద్దాం!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా అడ్డగోలు సీనరేజీ దోపిడీ
- కాంట్రాక్టు గడువు రెండు నెలలే ఉండడంతో కాసుల కోసం బరితెగింపు
- ఉన్న సమయంలో కోట్లు వెనకేసుకునేలా సీనరేజీ సాకుతో ఎడాపెడా వసూళ్లు
- చెరువులు, పొలాల్లో మట్టి తవ్వుకునే రైతులు, పేదలకూ మినహాయింపు లేదు
- మట్టి తవ్వకానికి కేబినెట్ అనుమతిచ్చినా ఖాతరు చేయకుండా సీనరేజీ దందా
- అనేకచోట్ల రసీదులు సైతం ఇవ్వకుండా కంపెనీ పేరుతో సిబ్బంది నగదు వసూళ్లు
- రౌతులపూడిలో సీనరేజీ పేరుతో దందా చేస్తుండడంపై తిరగబడ్డ లారీ యూనియన్
- అంబాజీపేటలో మట్టి ట్రాక్టర్ల నుంచీ పన్ను వసూలుపై తిరగబడ్డ స్థానికులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ సీనరేజీ పేరుతో ఎడాపెడా దండేస్తోంది.. ఎక్కడికక్కడ జనం ముక్కుపిండి అడ్డగోలుగా దోచేస్తోంది.. సొంత పొలం.. చెరువుల్లోంచి రైతులు, స్థానికులు తట్టెడు మట్టి తీసుకువెళ్తున్నా వాలిపోతోంది.. సీనరేజీ ఫీజులు కట్టాలంటూ రుబాబు చేస్తోంది. ఒకపక్క వాణిజ్యేతర అవసరాలకు రైతులు చెరువుల నుంచి మట్టి తీసుకువెళ్లడానికి ఇటీవల కేబినెట్ అనుమతిచ్చినా తనకేం సంబంధం లేదన్నట్టు దందా చేస్తోంది. ఇంకో రెండు నెలల్లో సంస్థ కాంట్రాక్టు ముగియనున్న నేపథ్యంలో ఈలోపే కోట్లకు కోట్లు దండేసేందుకు బరితెగించేస్తోంది. అనేకచోట్ల రేయింబవళ్లు కంపెనీ పేరుతో సిబ్బంది సీనరేజీ పేరుతో రసీదు లు సైతం లేకుండా నగదు వసూలు చేస్తుండడంతో పలుచోట్ల జనం తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖన తప్పించి సుధాకర్ ఇన్‌ఫ్రాకు అడ్డగోలుగా కట్టబెట్టింది. రెండేళ్ల వ్యవధిలో రూ.223 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలనే నెపంతో ఎక్కడికక్కడ పిండేసింది. ప్రభుత్వం మారాక 73 రోజులు కాంట్రాక్టు గడువు పెంచడంతో దందా కొనసాగిస్తోంది.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చిన్న తరహా ఖనిజాలు, గనులు, క్వారీలు, లేటరైట్, ఇతర గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి గనులశాఖ ఎన్నో ఏళ్లుగా సీనరేజీ వసూలు చేసేది. తద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం వచ్చేది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖను తప్పించేసింది. వీటి నుంచి భారీగా నిధులు బొక్కేయడం కోసం పథకం పన్ని ఏకంగా ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టింది. ఎవరికి తెలియకుండా అడ్డగోలుగా 2023 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనిరేజీ వసూలు కాంట్రాక్టును ఏకంగా సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీకి అప్పగించేసింది. రెండేళ్లపాటు ఈ కాంట్రాక్టు ఉండేలా ఆదేశాలు జారీచేసింది. ఇందుకుగాను రెండేళ్లకు ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లించేసి ఆపై ఎంత వసూలు చేసుకున్నా తనకు సంబంధం లేదన్నట్టు స్పష్టం చేసింది. పైగా రూ.233 కోట్లు ఒకేసారి కాకుండా నెలకు రూ.9.70కోట్ల చొప్పున ప్రభుత్వానికి కట్టేలా వెసులుబాటు కల్పించింది. సదరు కంపెనీ వెనుక ఉన్న ఓ కీలక వైసీపీ నేత చేతికి అధికారం దక్కడంతో రెచ్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, మైనింగ్ జరిగే ప్రాంతాలు, చెరువులు, కొండలు ఉన్నచోట్ల ఏకంగా భారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ప్రైవేటు సైన్యాన్ని దింపి ప్రతి లారీ నుంచి ముక్కుపిండి సీనరేజీని ఈ కంపెనీ వసూలుచేసింది. ఈ కంపెనీ రాకముందు నెలకు ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు పర్యవేక్షణ లేక, సిబ్బంది కొరతతో పట్టించుకోక రూ.3 కోట్లు కూడా వచ్చేది కాదు. కానీ సదరు ప్రైవేటు సంస్థ ఏకంగా ముక్కుపిండి నెలకు రూ.15కోట్ల వరకు పిండేసింది. ఇలా గతేడాది అసెంబ్లీ ఫలితాలు వచ్చేవరకు ఆడింది ఆట పాడింది పాట అన్నట్టు రెచ్చిపోయి ఉమ్మడి జిల్లాను కుమ్మేసింది. కోట్లకుకోట్ల సీనరేజీ పిండేసింది. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఈ సంస్థ ఆగడాలు ఆగినట్టేనని అంతా భావించారు. అప్పటి ప్రభుత్వం అడ్డగోలుగా కట్టబెట్టిన కాంట్రాక్ట రద్దవడం ఖాయం అని అనుకున్నారు. సుధాకర్ ఇన్‌ఫ్రా సైతం ప్రభుత్వం మారడంతో భయపడి తగ్గింది. మే, జూన్, జూలై నెలల్లో ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూళ్లు నిలిపివేసింది. కానీ మళ్లీ అదే కంపెనీ పైరవీలు నడిపింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్లు నిలిపివేసినందున ఆ సమయానికి తమకు సీనరేజీ వసూలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అటు ప్రభుత్వానికి సీనరేజీ బాకీలు కూడా ఉండడంతో అవి చెల్లించడానికి గడువు పొడిగించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఈనెల నుంచి జూలై 14 వరకు 73 రోజులపాటు సీనరేజీ వసూలు చేసుకునేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. జూలై 14 తర్వాత కాంట్రాక్టు రద్దవుతుందని స్పష్టంచేసింది.

గడువులోగా కుమ్మేద్దాం..

పొడిగించిన గడువు మరో రెండు నెలల్లో ముగియనుండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఇప్పుడు అడ్డగోలుగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో బరితెగించేస్తోంది. ఉన్న తక్కువ సమయంలో ఎక్కువ పిండేసేందుకు వీలుగా దౌర్జన్యాలకు తెగబడుతోంది. ఎక్కడికక్కడ కంపెనీ పేరుతో సిబ్బంది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాహనాల్లో తిరుగుతూ డబ్బులు కట్టాలంటూ చెరువులు, కాలువలు, కొండలు, గుట్టల వద్ద దందాలు చేస్తున్నారు. చేతిలో కనీసం రసీదు పుస్తకం కూడా లేకుండా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రౌతులపూడిలో కొండల నుంచి గ్రావెల్ తరలిస్తోన్న లారీలను సుధాకర్ ఇన్‌ఫ్రా పేరుతో కొందరు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రసీదులు లేకుండా డబ్బులు అడుగుతున్నారని లారీ యూనియన్ తిరగబడడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అలాగే కాకినాడ జిల్లా జగ్గంపేట, రౌతులపూడి, పెద్దాపురం మండలాల్లో చిన్నాచితకా క్వారీల నుంచి నల్లరాయి, గ్రావెల్, తూర్పుగోదావరిలో కొండల నుంచి చిన్నపాటి గ్రావెల్, మట్టి.. కోనసీమలో చెరువుల నుంచి మట్టి తరలిస్తున్న వారిని సైతం వదలకుండా నగదు డిమాండ్ చేస్తుండడంతో సదరు కంపెనీ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏమాత్రం బిల్లులు లేకుండా అడ్డదారిలో డబ్బులు వసూలు చేయడం ఏస్థాయిలో సీనరేజీ పేరుతో సదరు సంస్థ కోట్లకుకోట్లు దారిమళ్లిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు రైతులు వాణిజ్యేతర అవసరాలు చెరువుల్లో మట్టి తవ్వి తరలించుకోవచ్చని ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయినా ఈ కంపెనీ మాత్రం తనకు డబ్బు కట్టాల్సిందేనంటూ బరి తెగించేస్తోంది.

ఆ రూ.24 కోట్ల పేరుతోను..

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో అరబిందో సంస్థకు గత వైసీపీ ప్రభుత్వం ఓ కొండను రాసిచ్చేసింది. కాకినాడ సెజ్‌లో నిర్మిస్తోన్న పోర్టు కోసం ఇక్కడి నుంచి కావలసినంత రాయిని తవ్వుకోవడానికి వీలుగా రూ.71 కోట్ల వరకు సీనరేజీ పన్ను రద్దు చేసేసింది. ఇలా చేయడం వల్ల తనకు రావలసిన ఆదాయానికి గండిపడిందని సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా రూ.24కోట్ల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. తాను కట్టాల్సిన బాకీలో ఈ మొత్తం రద్దు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరింది. అయినా పట్టించుకోకపోవడంతో కొత్త ప్రభుత్వం వద్ద పైరవీలు చేసింది. వినకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ మొత్తం డబ్బులు ఒకవేళ తాను కట్టాల్సివస్తే నష్టపోతామనే కారణంతో కాంట్రాక్టు మిగిలి ఉన్న ఈ రెండు నెలల్లో ఎంత వీలైతే అంత అడ్డగోలుగా పిండేయాలని సదరు సంస్థ పన్నాగం పన్నింది. అందుకే ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ పేరుతో నగదు వసూళ్లకు తెగబడుతోంది.

కోనసీమలోనూ అదే తీరు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సెస్ వసూలుకు వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు పొందిన సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరిట జరుగుతున్న దందా విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల ఓ వివాదం పోలీసుస్టేషన్‌కూ చేరింది. పి.గన్నవరం మండలం నుంచి ఓ రైతుకు చెందిన పొలం నుంచి నల్లమట్టిని ట్రాక్టర్లపై అంబాజీపేట హైస్కూలుకు తరలిస్తుండగా వాటిని ఆపిన సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది వారికి సొమ్ములు చెల్లించాలని డ్రైవర్లను అడిగారు. దాంతో డ్రైవర్లకు, సంస్థకు చెందిన వారికి మధ్య ఘర్షణ తలెత్తడంతోపాటు వారి ప్రైవేటు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఆ ట్రాక్టర్ల డ్రైవర్లు, వాటి యజమానిపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతో తమ పొలంలో మట్టి తీసుకుని తరలిస్తే సెస్ ఎందుకు చెల్లించాలని రైతులు నిలదీస్తున్నారు.

యథేచ్ఛగా..

- అనుమతులు ఒక చోట.. తవ్వకాలు మరో చోట
- అనుమతుల ముసుగులో రెచ్చిపోతున్న మట్టిమాఫియా
- ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మైన్స్, రెవెన్యూ అధికారులు
- ర్యాంపులో ఆరు లారీలు, రెండు ఎక్స్‌కవేటర్‌లు స్వాధీనం

పి.గన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులు పేరిట తాత్కాలిక అనుమతులు తెచ్చుకున్న మట్టిమాఫియా అనధికార తవ్వకాలు జరుపుతోంది. పి.గన్నవరం మండలం మానేపల్లిలంకలో 498-2, 526-10-10బి, 435-1 సర్వే నెంబర్లలో 1.50 ఎకరాల్లో హైవే పనులు నిమిత్తం తువ్వ మట్టి తవ్వకాలు జరిపేందుకు అనుమతులకు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. మైన్స్ అధికారులనుంచి పూర్తిస్థాయి అనుమతులు రాకుండానే విచ్చలవిడిగా తవ్వకాలు ప్రారంభించారు. నిబంధనలకు విరుద్ధంగా ఐదడుగులు దాటి తవ్వకాలు జరుపుతున్నారు. తవ్వకాలు జరిపిన చోట నీరుసైతం బయటకు వచ్చిందంటే పరిస్థితి అర్థంచేసుకోవచ్చు. అనుమతులకోసం దరఖాస్తులో పేర్కొన్న భూమిలో కాకుండా మరోచోట తవ్వకాలు ప్రారంభించారు. మానేపల్లి పల్లిపాలెం సమీపంలో ఉన్న నదిపాయకు నిబంధనలకు విరుద్ధంగా డ్రెజ్జర్ సాయంతో అడ్డుకట్ట వేశారు. దీనిపైనుంచే మట్టి లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. మానేపల్లిలంక పరిధిలో మరో తువ్వ మట్టిర్యాంపులో తవ్వకాలు జరిపేందుకు అనుమతులు తెచ్చుకుని నాగుల్లంక పరిధిలోని కందాలపాలెం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అనుమతులు ఇచ్చినచోట కాకుండా మరోచోట భారీస్థాయిలో గోదావరి నదీ గర్భాన్ని సైతం కొల్లకొట్టారు. వైవీపాలెంలో కూడా అనుమతులు ముగిసినా.. తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉడిమూడిలో అనుమతులు ముగిసినా తవ్వకాలు జరిపి ప్రస్తుతం నిలిపివేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై జేసీకి ఫిర్యాదులు అందడంతో మైన్స్ అధికారులు తనిఖీలు చేశారు.

ఆరు లారీలు, మూడు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం

మానేపల్లిలంకలో రెవెన్యూ అధికారులతో కలిసి మైన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అనుమతులు లేనిచోట తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించి ర్యాంపులో ఉన్న ఐదు ఖాళీ లారీలతోపాటు ఒక తువ్వ మట్టి లారీని, రెండు ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను రెవెన్యూ, పోలీసులకు అప్పగించినట్లు వారు తెలిపారు. దాడుల్లో తహశీల్దార్ పి.శ్రీపల్లవి, మైన్స్ ఆర్‌ఐ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ అలీ, ఆర్‌ఐ ఉన్నారు.

మండలంలో ఏ ర్యాంపునకు అనుమతులు లేవు

-గనుల, భూగర్భశాఖ సహాయ సంచాలకులు ఎల్.వంశీధరరెడ్డి

పి.గన్నవరం మండలంలో తువ్వమట్టి తవ్వకాలకు అనుమతులు లేవు. లంకలగన్నవరం, ఉడిమూడి, మానేపల్లిలంక ప్రాంతాల్లో ప్రభుత్వ పనుల నిమిత్తం తువ్వమట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చాం. తాత్కాలిక అనుమతులు గడువు ముగిసింది. ప్రస్తుతం ఏ ర్యాంపులకు అనుమతులు లేవు. మానేపల్లిలంకలో ఒక ర్యాంపు కోసం కొందరు దరఖాస్తు చేసుకున్నారు. పరిశీలన పూర్తయింది కానీ మ్యాపింగ్ పూర్తికాలేదు.

ఇవి కాటేస్తే.. ప్రాణ సంకటమే! 6

భూముల సర్వే పక్కాగా చేపట్టాలి

- అధికారులకు జేసీ ఆదేశం

అమలాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి నిర్దేశించిందే రీసర్వే ప్రక్రియ అని జేసీ టి.నిషాంతి అన్నారు.అమరావతినుంచి భూపరిపాలన ముఖ్య కార్యదర్శి ఎన్.ప్రభాకర్‌రెడ్డి బుధవారం జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో భూముల క్రమబద్ధీకరణచట్టం 2025పై సుదీర్ఘంగా మాట్లాడారు. అందరికీ ఇళ్లు, నీటితీరువా వసూళ్లు, రీసర్వే పైలెట్ ప్రాజెక్టు రెండో దశ పురోగతిపై సమీక్షించారు. కాన్ఫరెన్సు అనంతరం జేసీ నిషాంతి జిల్లా అధికారులతో మాట్లాడారు. నిర్దేశిత గడువులోగా రీసర్వే ప్రక్రియ సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామ, మండల సర్వేయర్లు, రీసర్వే డీటీలు, తహశీల్దార్లు పూర్తిసమన్వయంతో భూముల రికార్డులను స్వచ్ఛీకరించి భవిష్యత్తులో వివాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. భూ సర్వే చేసే ముందు రైతులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో హద్దులు నిర్ణయించడం, ప్రభుత్వ, ఇతరత్రా భూముల కొలతలు వేసి కచ్చితంగా సరిహద్దులు ఏర్పాటుచేయాలని సూచించారు. రీసర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామాన్ని బ్లాక్‌లుగా విభజించి ప్రతి బ్లాక్‌కు అధికారులను నియమించి రోజుకు 20 ఎకరాల రీసర్వే చేయాలని, అందరికీ వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి సమాచారం తెలియచేయాలని సూచించారు. రైతులు పక్కాగా భూముల రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రోత్సహించాల్సిందిగా ఆమె కోరారు. డీఆర్వో రాజకుమారి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఎ.ప్రభాకర్, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పురోగతి ఏదీ?

- ముందుకు కదలని కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పనులు
- రెండున్నర దశాబ్దాల క్రితం పడిన పునాదిరాయి
- మూడు గోదావరి నదుల్లో మొండి గోడల్లా మిగిలిన పిల్లర్లు
- గడ్డర్లు, ట్రాక్‌ల నిర్మాణంలో కానరాని ప్రగతి
- బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా ముందుకు సాగని పనులు



వైనతేయ నదిపై పాశర్లపూడి-బోడసకుర్రు మధ్య నిర్మాణ దశలో ఉన్న పిల్లర్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ ప్రజల చిరకాల స్వప్నమైన కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టిన ఈ రైల్వేలైన్ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అడుగు ముందుకు పడడంలేదు. దీంతో కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణ పనులపై ప్రజల్లో ఆందోళన మొదలైంది. కోనసీమ జిల్లాలోని మూడు ప్రధానమైన గోదావరి నదీపాయలపై వారధులకు సంబంధించి పియర్స్(పిల్లర్స్) నిర్మాణాలు పూర్తయినా గడ్డర్ల ఏర్పాటులో మాత్రం కొన్నేళ్లుగా కాంట్రాక్టు సంస్థ మౌనం వహిస్తోంది. టెండర్లు పిలిచాం. త్వరలో గడ్డర్లు నిర్మిస్తామని కొన్నేళ్లుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ వాటికీ అతీగతీ లేదు. కేంద్రంలో టీడీపీ పార్లమెంటు విప్, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ కోనసీమ ప్రజలకు రైల్వేలైన్ కూత వినిపించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆశించిన మేర స్పందన లేకపోవడంతో ఈ రైల్వేలైన్ నిర్మాణ పనులకు అడుగడుగునా అవరోధాలే ఏర్పడుతున్నాయి.

రెండున్నర దశాబ్దాల క్రితం శంకుస్థాపన

రెండో ప్రపంచ యుద్ధం అనంతరం తొలగించబడ్డ కాకినాడ-కోటిపల్లి రైల్వేలైన్‌తోపాటు కోటిపల్లినుంచి నర్సాపురం వరకు రైల్వేలైన్ నిర్మాణం కోసం అప్పట్లో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే లైన్ నిర్మాణం పూర్తయి కొంతకాలంపాటు ట్రైన్ నడిపారు. ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో ఆ రైలు కాస్తా ప్రయాణికుల కోసం రైల్ బస్‌గా నడిపారు. అది ప్రస్తుతం మరుగున పడిపోయింది. ఇక కోటిపల్లి-నర్సాపురం రైల్వే నిర్మాణం కోసం 2000, నవంబరు 16న అప్పటి కేంద్ర రైల్వేమంత్రి మమతా బెనర్జీ లోక్‌సభ స్పీకర్ హోదాలో జీఎంసీ బాలయోగి సమక్షంలో శంకుస్థాపన జరిగింది. మొత్తం 102.500 కిలోమీటర్ల పొడవైన కాకినాడ-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా కాకినాడ-కోటిపల్లి వరకు 45.30 కిలోమీటర్ల మేర ట్రాక్ పూర్తయింది. కోటిపల్లి నుంచి నర్సాపురం వరకు 57.207 కిలోమీటర్ల మేర కొత్తగా రైల్వేట్రాక్ నిర్మాణంతోపాటు గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదులపై వారధులు నిర్మించడానికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. అప్పట్లో రూ.2వేల కోట్ల పైబడిన నిర్మాణ వ్యయం ఇప్పుడు రూ.3వేల కోట్లకు చేరే అవకాశం ఉంది. వశిష్ఠ,వైనతేయ, గౌతమీ నదీపాయలపై యుద్ధ ప్రాతిపదికనే వారధుల నిర్మాణానికి అప్పట్లో బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పిల్లర్లు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అబెట్‌మెంట్ వాల్స్ కూడా సిద్ధమయ్యాయి. రెండు మూడు ప్రాంతాల్లో సాంకేతిక సమస్యల కారణంగా పిల్లర్స్ నిర్మాణంలో జాప్యం కొనసాగుతోంది.

గడ్డర్లు నిర్మించేది ఎప్పుడు..

మూడు నదీపాయలపై నిర్మించిన పిల్లర్లపై గడ్డర్లు నిర్మిస్తే రైల్వేట్రాక్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లతోపాటు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా గడ్డర్ల నిర్మాణ ప్రగతిపై స్పష్టమైన ప్రకటన అయితే వెలువడలేదు. వారధులకు పిల్లర్లు నియమించినా గడ్డర్లు నిర్మించి ట్రాక్ ఏర్పాటు చేస్తే మిగిలిన ట్రాక్ నిర్మాణ పనులు, ఇతర కల్వర్టర్లు, నిర్మాణాలు వంటివి చేపట్టే అవకాశం ఉంది. కాంట్రాక్టు సంస్థ త్వరలోనే ఈ పనులు చేపడుతుందని కొన్నేళ్లనుంచి ప్రచారం జరుగుతున్నా వాటిపై ఇప్పటికీ స్పష్టత లేదు. మరోవైపు భూసేకరణ అంశం కూడా అవరోధంగా మారింది. కోటిపల్లి నుంచి శానపల్లిలంక వరకు గౌతమీ నదిపై వారధి పిల్లర్లు నియమించారు. గడ్డర్లు వేయకపోవడంతో నదిలో నిర్మించిన 41 పిల్లర్లు మొండి గోడల్లా దర్శనమిస్తున్నాయి. శానపల్లిలంక నుంచి అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి వరకు 12 కిలోమీటర్ల మేర రైల్వేట్రాక్ నిర్మాణానికి అప్పట్లోనే భూసేకరణ జరిగింది. ఇప్పుడు తాజా పరిణామాలతో రైతులు భూమిని అప్పగించేందుకు అడ్డంకులు సృష్టిస్తుండడంతో వాటిని క్లియర్ చేసేందుకు ఎంపీ హరీష్‌మాధుర్ కృషి చేస్తున్నారు. కానీ ఈ పనులకు పట్టిన గ్రహణం ఎప్పుడు వీడుతుందా లేదా అనే సందిగ్ధత జిల్లా వాసుల్లో నెలకొంది.

బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా ప్రగతి శూన్యం

కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంకోసం కేంద్రం ప్రవేశపెట్టే రైల్వే బడ్జెట్‌లో ప్రతిఏటా రూ.వంద కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నారు. ఆ నిధులను ఇక్కడ నిర్మాణ పనులకు వెచ్చించకపోవడంతో బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర ప్రాంతాల రైల్వేపనులకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది కూడా రూ.160కోట్లు పైబడి బడ్జెట్ కేటాయింపులు జరిగినట్టు ప్రచారం జరిగినా పనుల్లో పురోగతి లేదు. అయినవిల్లి మండలం శానపల్లిలంక నుంచి నర్సాపురం వరకు భూసేకరణ అవరోధంగా మారుతోంది. ఇష్టానుసారం రైల్వే ట్రాక్‌ను వివిధ ప్రాంతాల గుండా నిర్మిస్తున్నామనే ముందస్తు ప్రచారంతో ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో చాలాచోట్ల భూసేకరణకు బ్రేక్ పడుతోంది. ప్రస్తుతం వేసవి కావడంతో ఈ రెండు నెలల్లో గడ్డర్ల నిర్మాణం పూర్తియితే ట్రాక్‌ను సునాయాసంగా నిర్మించుకోవచ్చునని ప్రజలు పేర్కొంటున్నారు. రైల్వేలైన్ కొత్త ఎలైన్‌మెంట్ పేరుతో వెలువడుతున్న ప్రకటనలు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

రైల్వే ప్రాజెక్టు పూర్తిచేయడమే నా లక్ష్యం

-గంటి హరీష్‌మాధుర్, ఎంపీ, అమలాపురం

మరో నాలుగేళ్లలో ఈ రైల్వే ప్రాజెక్టును పూర్తిచేసి కోనసీమ ప్రజలకు అంకితం చేయాలన్నదే నా లక్ష్యం. మా నాన్న లోక్‌సభ మాజీ స్పీకర్ దివంగత బాలయోగి చిరకాల వాంఛగా మిగిలిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తున్నాను. ఇప్పటికే కేంద్ర రైల్వేమంత్రిని పలు పర్యాయాలు కలిసి రైల్వేలైన్ నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలనే సంకల్పంతోనే ముందుకు సాగుతున్నాను.

మహిళపై హత్యాయత్నం 7

- 16 గంటలు అచేతనస్థితిలో తుప్పల్లో ఉండిపోయిన వైనం
- కోనసీమ జిల్లా అల్లవరంలోని సడక్ రోడ్డులో ఘటన

రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి: జేసీ

అమలాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులు సమన్వయంతో పని చేసి 216 రహదారి నిర్మాణంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జేసీ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. 216 ఎన్‌హెచ్ నిర్మాణ పనుల్లో భూసేకరణ అవార్డులు, నష్టపరిహారాల చెల్లింపుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ అంశాలపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. అమలాపురం, భట్నవిల్లి రోడ్డు వెంబడి డ్రైనేజీ నిర్మించాలని సూచించారు. నష్టపరిహారం విషయంలో జాప్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాజోలు మండలంలో 216 రహదారి మార్గంలో భద్రతా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. డీఆర్వో రాజకుమారి, ఎన్‌హెచ్ అధికారి సాయిశ్రీనివాస్, ఏఈ వెంకటరమణ పాల్గొన్నారు.

మలేరియా నివారణ చర్యలకు ప్రాధాన్యం: డీఎంవో నక్కా వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం, మే 14(ఆంధ్రజ్యోతి): దోమల కారణంగా వచ్చే మలేరియా వ్యాధి నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. గొల్లవిల్లి బాలికల సంక్షేమ వసతిగృహంలో చేపట్టిన పారిశుధ్య చర్యలను బుధవారం ఆయన పరిశీలించారు. దోమల నివారణకు 5శాతం ఏసీఎం మందును గదుల్లో స్ప్రే చేయించిన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. సబ్ యూనిట్ అధికారి ఎస్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పలగుప్తం పీహెచ్‌సీ వైద్యాధికారి లంకే నాగార్జున, హెచ్‌వీ కమల, హెచ్‌ఏ బాబ్జి, ఏఎన్ఎం రాధాసలూజా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ వసతిగృహం వద్ద గోడపై వివరాలను నమోదు చేస్తున్న డీఎంవో

ఇవి కాటేస్తే...



జంతువులు.. కీటకాలు.. విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ మార్పులతో అప్పుడప్పుడూ వానలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాములు, తేళ్లు, జర్రులతోపాటు పలు రకాలు విషపూర్తి కీటకాలు భూమిలోనుంచి జనావాసాల్లోకి వస్తుంటాయి. ఇవే కాక పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు వంటివి ఒక్కోసారి ప్రమాదవశాత్తూ కరుస్తుంటాయి. ఇలా జంతువులు, కీటకాల కాట్లకు గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రి సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్క కరిస్తే యాంటీ రేబిస్ ఇంజక్షన్, విషసర్పాలు కరిస్తే యాంటీ స్నేక్ వ్యాక్సిన్, తేళ్లు వంటివి కరిస్తే దానికి సంబంధించిన ఇంజక్షన్లు చేస్తారు. ఇంకా దీనికి సంబంధించిన వివరాలు తెలుసుకుందాం..

ప్రాణ సంకటమే!




- జంతువులు.. కీటకాలతో జాగ్రత్త అవసరం
- వేసవిలో వర్షాలు... జనావాసాల్లోకి విష సర్పాలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువ
- కుక్కలతోనూ జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- విషపూరిత కీటకాలు కాటేస్తే తక్షణ వైద్యం అవసరం
- అందుబాటులో వైద్యం.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం
- వెంటనే చికిత్స చేయించుకోవడం ఉత్తమం



జీజీహెచ్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి

శునకాలను చాలా మంది ఇళ్లల్లో ఇష్టంగా పెంచుకుంటూ ఉంటారు. ఒక్కోసారి అది కరిస్తే పెంపుడు జంతువే కదా అని అశ్రద్ధ చేస్తారు. అది హాని చేసినా పట్టించుకోకపోతే భారీ మూల్యం చెల్లించకతప్పదు. విషసర్పాలు కాటు వేసినా మా ఇలవేల్పే కదా అని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణం మీదికి తెస్తుంది. వృశ్చికం (తేలు) పరిస్థితి కూడా అంతే. ఇకపోతే దోమే కదా అది కాటేస్తే ఏమౌతుందిలే అని తేలిగ్గా తీసిపారేస్తాం. కానీ ఇవే చాప కింద నీరులా విషజ్వరాలుగా మారి ప్రాణాల మీదికి తెస్తుంది. మనిషి ఇన్ని ప్రాణాపాయాల నుంచి బయట పడాలంటే ప్రాథమిక దశలో తీసుకునే వైద్యుల సలహాలు, సూచనలే శ్రీరామరక్షగా ఉంటాయి.

● పాముకాటు వేస్తే..



అని పాములు విషపూరితమైనవి కావు. విషసర్పం కాటు వేస్తే శరీరంపై కాటు గుర్తులు పడతాయి. అక్కడ వాపు లేదా రక్తస్రావం జరగొచ్చు. విషం శరీరంలోకి మెల్లగా పాకే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. వికారం, వాంతులు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, కండరాల బలహీనత వంటివి జరిగే అవకాశం ఉంటుంది. పాము కాటు వేసిన తర్వాత తొందరలో కొన్ని పొరపాట్లు చేయకూడదు. కాటు వేసిన ప్రాంతాన్ని కడగకూడదు. రక్తప్రవాహాన్ని ఆపడానికి కట్లు కట్టడం వంటివి చేయకూడదు. విషం పీల్చడానికి ప్రయత్నించవద్దు. బాధితు డిని ఆందోళన చెందనివ్వరాదు. ఎటువంటి మంత్రానికి తీసుకుని వెళ్లరాదు. వెంటనే దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా అర్హుడైన వైద్యుడి వద్దకు తీసుకువెళ్లాలి. వీలైతే కాటువేసిన పాము జాతి లేదా ఏ రంగులో ఉందో వైద్యులకు తెలియజేయాలి. వైద్యపరీక్షల అనంతరం పాము ద్వారా ఎక్కిన విషాన్ని బట్టి అక్కడ వైద్యులు పెద్దాస్పత్రికి సిఫార్సు చేస్తారు. తద్వారా శరీరంలో ఎక్కిన విషాన్ని బట్టి యాంటీ స్నేక్ వేనం (ఏఎస్‌వీ) వ్యాక్సిన్‌ను వైద్యుల పర్యవేక్షణలో ఇస్తారు.

● ప్రమాదకరం పాముకాట్లు

వేసవికాలమైనా ఇప్పుడు కూడా ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. పొలాల్లో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే అప్రమత్తంగా లేనివారు పాము కాట్లకు గురైన కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పొలం పనులతోపాటు గ్రామీణ ప్రాంతంలో పాత నివాసగృహాలు, పరిసరాలు శుభ్రత పాటించలేని ఇళ్లవద్ద జనం పాముకాట్లకు గురైన మృతి చెందిన సంఘటనలున్నాయి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాట్లకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నా సకాలంలో సరైన వైద్యం అందక ఏదో ఒకచోట పాముకాటుకు గురై ఎవరో ఒకరు మృతి చెందుతూనే ఉన్నారు.

● రెండు రకాల విషసర్పాలు

పాములు రెండు రకాలు ఉండగా న్యూరోటాక్సిల్ రకం.. నాగుపాము, కట్ల పాము... రెండో రకం హిమోటాక్సిన్ అంటే రక్తపింజర వంటి పాములు ఉన్నాయి. న్యూరోటాక్సిల్‌తో నోటి ద్వారా నురగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. హిమోటాక్సిల్‌తో క్షణాల్లో కణజాలం నశించి కాటుపడిన భాగంలో వాపు వస్తుంది. ఎలాంటి పాము అని తెలుసుకుంటే చికిత్స చాలా సులభంగా ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. పక్కపక్కనే రెండు దంతాల కాట్లు కనిపిస్తే ఇక అది కచ్చితంగా విషపురుగే. ఎలాంటి పాము కాటేసినా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.

● ధైర్యమే రక్ష

సాధ్యమైనంత వరకు పాములు, విషకీటకాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట పొలాలకు వెళ్లే వారు కర్ర, టార్చ్‌లైటు తీసుకెళ్లాలి. ఇంటి ఆవరణంలో ముళ్లపొదలు, రంధ్రాలు, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. ఒకవేళ పాముకాటుకు గురైనప్పుడు ఆందోళనకు గురి కాకూడదు, ఆ ప్రమాదం గుండెపోటుకు దారితీస్తుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించాలి. పాము కరిచిన వారిలో ఎక్కువ శాతం భయందోళనకు గురై మరణించే అవకాశం ఉంది. వారికి ధైర్యం చెప్పి వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. పాము కరిచిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లితే 99 శాతం బతికే అవకాశం ఉందని, పాము ఎలాంటిదైనా చికిత్సలు చేయిస్తేనే ప్రాణాలు పదిలం అంటున్నారు వైద్యులు. ప్రతిఏటా పాము కాట్లకు గురవుతున్న వారిలో 80 శాతంపైగా ప్రాణాలు పొగొట్టుకుటుంటున్నది గ్రామీణులే అని వైద్యులు చెబుతున్నారు.

● మందులు ఉన్నాయి

పాము కాటుకు సంబంధించి మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురైన వెంటనే సకాలంలో ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకువచ్చి(యాంటీ స్నేక్ వీనం) ఇంజక్షన్లు వేయించుకోవాలి. మూఢనమ్మకాలు, నాటువైద్యం నమ్మకుండా దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలి. ప్రధానంగా రైతు, రైతు కూలీలు పొలాలకు వెళ్లేటప్పుడు, ఇండ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుంటే పాముకాటు నుంచి రక్షణ చేసుకోవచ్చు.

● కుక్క కాటుకు..

ప్రమాదవశాత్తూ కుక్క కరిస్తే పెంపుడు కుక్కే కదా అని అశ్రద్ధ చేయకూడదు. పెద్ద గాయం లేదా ముఖానికి దగ్గరగా గాయమైనా దగ్గరలోని పీహెచ్‌సీ లేదా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్తే అక్కడ ఇమ్యునో గ్లోబ్యూలిన్స్ గాయం చుట్టూ ఇచ్చి అనంతరం టీటీ ఇంజక్షన్ ఇస్తారు. అనంతరం నాలుగు దఫాలుగా యాంటీ రేబిస్ (ఏఆర్‌వీ) వ్యాక్సిన్‌ను క్రమం తప్పకుండా వేయించుకోవాలి. కొన్ని రకాల ఆహారాలు తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అలా కాకుండా నిర్లక్ష్యం చేసి వ్యాక్సిన్ వేయించుకోకుండా ఉంటే రేబిస్‌కు గురై మరణించే అవకాశం ఉంటుంది.

● దోమలు ప్రమాదమే...



ఇక అతి ముఖ్యమైనది రకరకాల దోమ జాతులు వానాకాలం, శీతాకాలంలో వృద్ధి చెంది అవి కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా తదితర విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుంది.

● తేలు కరిస్తే...



చిన్నచిన్న తేళ్ల వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. అదే పెద్ద తేలు కుడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న వైద్యుడ్ని సంప్రదించాలి. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆయన సిఫార్సు మేరకు పెద్దాసుపత్రిలో చేరడం ద్వారా మెరుగైన చికిత్స అంది ప్రాణాపాయం తప్పుతుంది.

అల్లూరి పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

● కంబాలచెరువు వద్ద సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు వద్ద ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, మన్యం వీరుల విగ్రహాల సముదాయం

రాజమహేంద్రవరంసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి):బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువుచిరంజీవి పార్కును రూ.కోటీ 25లక్షలతో అభివృద్ధిచేసి అక్కడ ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, ఆయన అనుచరులు మన్యంవీరుల విగ్రహాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో రాజమహేంద్రవరానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతాలలో ఆయన సంచరించారని గుర్తుచేశారు. అటువంటి పోరాటయోధుల విగ్రహాలను చూసి భవిష్యత్‌తరాలు స్ఫూర్తినొందాలని మన్యం వీరుల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.75లక్షలు, రూడా నుంచి మ్యాచింగ్ ఫండ్స్ రూ.50లక్షలు కలిపి మొత్తం రూ.కోటి 25లక్షలతో పార్కు అభివృద్ధి చేశామన్నారు. చిరంజీవి పార్కుకు చరిత్ర ఉందన్నారు. గతంలో ఈ పార్కును అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి ప్రారంభించాల్సివుండగా కొన్ని అనివార్యకారణాల వల్ల పార్కు ప్రారంభం కాలేదన్నారు. అప్పటి నుంచి ఈపార్కు బాగోగులు చిరంజీవి అభిమానులే చూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా అమృత పథకం 2.0లో కేంద్రం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు గ్రాంటు కేటాయించిందని అందులో రాజమహేంద్రవరానికి రూ.200 కోట్లు కేటాయించిందని, ఇది శుభపరిణామమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడిన యోధుడు అల్లూరి అని అన్నారు. అల్లూరి సీతారామరాజు తోపాటు మన్యంవీరుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటుచేయడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరీకరణ అనేది చాలా వేగంగా జరుగుతుందన్నారు. పట్టణాలకు పల్లె ప్రాంతాల నుంచి ప్రజలు నివాసానికి వస్తున్న తరుణంలో పార్కులను, స్పోర్ట్స్‌కు సంబంధించిన ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా రుడా, నగరపాలక సంస్థ అథారిటీ వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి పేరున ఉన్న పార్కును ప్రారంభించామన్నారు. జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను మాట్లాడుతూ 2002లో మెగాస్టార్ చిరంజీవి ఇదే పార్కులో ప్రస్తుతం ఉన్న మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించలేని విధంగా అభిమానులు కిక్కిరిశారని ఆనాటి రోజును గుర్తుచేశారు..



అధికారులతో చర్చిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి సయాని

ప్రాథమిక హక్కుల పరిరక్షణే కమిషన్ ధ్యేయం

● ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను అందించడంలో ప్రభుత్వశాఖలు వివక్ష ధోరణి చూపుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని. ప్రజలు ఆ హక్కులను పొందేవిధంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ ఆర్‌సీ) కృషి చేస్తోందని కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని పేర్కొన్నారు. రెండురోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి ఆమె రాజమహేంద్రవరం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవహక్కుల విషయంలో ఉల్లంఘన జరిగితే ఎన్‌హెచ్ ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరుల ఇబ్బందులపై కేసులను సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తామ న్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించాల్సిన సేవల లోపాల విష యంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటివరకూ 39 గిరిజన వసతిగృహాలు, ఎస్టీ కాలనీలు, పాఠశాలలు, మండల తహ శీల్దారు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలుచేసి పౌరుల సమస్యలు తెలుసుకున్నామని, వాటిపై కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. పింఛన్లు అందక ఇబ్బంది పడుతున్న అర్హులకు కూడా పరిష్కారం చూపుతామన్నారు. మహిళల గౌరవానికి, భద్రతకు భంగం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే నేరుగా కమిషన్‌కి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని, ఏ రాష్ట్రంలోనూ అనుబంధ సంఘాలు లేవని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లోని కమిషన్ వెబ్‌సైటు nhrc.netలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తొలుతగా జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలతో ఆమె బుధవారం రాత్రి సమావేశమయ్యారు. వారి సమస్యలు, నిర్వహణ, విధుల్లో ఇబ్బందులు, బలహీనవర్గాల సమస్యలు, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ప్రజల స్థితిగతులపై చర్చించారు. అధికారులకు తెలియజేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని అంగన్వాడీ కార్యకర్తలతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి పేర్కొన్నారు.



ఐదో యూనిట్‌లో టర్బన్ పనులు, కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

రూ.510 కోట్లు 2 యూనిట్లు

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో శరవేగంగా 5, 6 యూనిట్ల పనులు



మోతుగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పరిధి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో 5,6 యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తొలుత వీటిని మే నెలాఖరుకు పూర్తి చేయాలనుకన్నా కొన్ని కారణాల వల్ల మరో ఆరు నెలలు (నవంబరు వరకు) పొడిగించినట్టు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ స్వామినాయుడు తెలిపారు. ఈ యూనిట్లకు సంబంధించి సివిల్ మేజర్ పనులు పూర్తయ్యాయని, మిగిలినవి కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆ రెండు యూనిట్లకు నీటిని సరఫరా చేసే మూడో పెన్‌స్టాక్ పైపులైన్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు సైతం శరవేగంగా సాగుతున్నాయి. సీఈ స్వామినాయడు, ఇతర ఉన్నతాధికారులు వీటిని పరిశీలిస్తున్నారు. కాంట్రాక్టర్లు నవంబరు నెలాఖరుకు పనులు పూర్తి చేసి జెన్‌కోకు అప్పగిస్తే పొల్లూరు జల విద్యుత్ కేంద్రం 690 మెగావాట్లతో అధిక ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తుందని సీఈ వివరించారు.

లక్ష్యాలు స్వల్పంగా పెంపు

రాష్ట్రంలో జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి సంబంధించి కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) లక్ష్యాలు నిర్దేశిస్తోందని సీఈ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌కు 2286 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా విధించారు. మార్చి నెలాఖరుకు నాలుగు జల విద్యుత్ కేంద్రాలు (పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్) ద్వారా 2,454 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి జరిగింది. లక్ష్యం కంటే 168 మిలియన్ యూనిట్లు అదనంగా ఉత్పత్తి చేశామన్నారు. దీంతో కేంద్ర విద్యుత్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు కేంద్రాల లక్ష్యాలను గతేడాది కంటే 28 మిలియన్ యూనిట్లు పెంచింది. ఈ ఏడాది సీలేరు కాంపెక్స్ లక్ష్యం 2314 మిలియన్ యూనిట్లు సాధించేలా కృషి చేస్తామని సీఈ వివరించారు.



ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న నన్నయ విశ్వవిద్యాలయం, టీఐకేఎం అధికారులు

శ్రీలంక సంస్థతో సంయుక్త పరిశోధనకు 'నన్నయ' అవగాహన ఒప్పందం

దివాన్‌చెరువు, మే 14 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ సంస్థతో చేసుకున్న ఎంవోయూ ద్వారా సంయుక్త పరిశోధనకు, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ వంటి పలు అంశాల్లో పరస్పర సహకారం లభిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. శ్రీలంకకు చెందిన ది ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్మెంట్ (టీఐ ఐకేఎం)తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం విశ్వవిద్యాలయం ఈసీ హాల్లో జరిగిన సమావేశానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టీఐఐకేఎం సహ వ్యవస్థాపకుడు ఇసాంక పి గమగే ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి వీసీ సమక్షంలో మార్చుకున్నారు. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంతర్జాతీయ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీని ద్వారా జాయింట్ కాన్ఫరెన్స్‌లు, వెబినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, డిగ్రీ కార్యక్రమాలు, కమ్యూనిటీ సర్వీసెస్, పబ్లికేషన్ సపోర్ట్ సర్వీసెస్ వంటి వాటికి పరస్పరం సహకారం లభిస్తుంద న్నారు. భవిష్యత్తులో అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వి.పెర్సిస్, శ్రీలంక శ్రీజయవర్ధనేపుర విశ్వవిద్యాలయం పాలీ, బౌద్ధ అధ్యయనాల విభాగా నికి చెందిన మొరవాక ధమ్మరఖిత థెరో, ప్రొఫెసర్ నిమాలి తక్షితలా వితనాగే తదితరులు పాల్గొన్నారు.



అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఉమ్మడి' జిల్లా జట్ల పయనం

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లు బుధవారం పిఠాపురం నుంచి పయనమయ్యాయి. వీరికి గత నాలుగు రోజులుగా పిఠాపురంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులకు పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు కొత్తపల్లి బుజ్జి, బొజ్జా కుమార్, పల్నాటి మధు, జాన్, బాబీ క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తదితరులు పాల్గొన్నారు.



మేమూ అవుతాం బీచ్‌లో చిల్

ప్రస్తుతం ఎండలకు మనుషులే విలవిల్లాడుతున్నారు. అలాంటిది మూగజీవాలు పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పాలిన పనే లేదు. ఎప్పుడూ సందర్శకులతో ఉండే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో బుధవారం ఇదిలో ఇలా గేదెల గుంపు అతిథుల్లాగా వచ్చి కాసింతసేపు సేదతీరింది.

ఫొటోగ్రాఫర్- కాకినాడ



నేనున్నానని..నీకేం కాదని...

ఎన్నో ఏళ్లు వయసు ఉన్న వృక్షం మరణిస్తే అందులో నుంచి నేను ఉన్నానంటూ నిర్జీవ వృక్షాన్ని ఆసరా చేసుకుని కొత్త వృక్షం పునరుజ్జీవంతో పర్యావరణ హితానికి అడుగులు వేస్తోంది. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్‌లో మూడోవ రైలు బ్రిడ్జికి సమీపంలో పూర్తిగా ఎండిపోయిన నిద్రగన్నేరు చెట్టును అనుకుని మరిచెట్టు మహావృక్షంగా మారేందుకు పాత వృక్షాన్ని ఆసరగా చేసుకుని పచ్చదనాన్ని అందిస్తోంది

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

యువత... జాగ్రత్త!



- వేసవిలో జలకాలాటలకు దిగుతున్న యువకులు, విద్యార్థులు
- గల్లంతవుతున్న ఘటనలు
- కాలువ గట్లకు తూట్లతో ప్రమాదాలు

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు యువత కాలువ గట్ల వద్ద వాలిపోతుంటారు. సరదగా స్నానాలు చేద్దామని స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. అది వినోదమే కానీ దాని వెనుక ప్రమాదం దాగి ఉందనే సంగతి మరిచిపోతున్నారు. ఫలితంగా గల్లంతుకావడం, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతు న్నాయి. ముఖ్యంగా కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాద భరితంగా మారింది. ఈ కాలువకు నియోజకవర్గంలోని పెదశంకర్లపూడి, రౌతుపాలెం, పెద్దిపాలెం, పొదురుపాక, గజ్జనపూడి, చింతలూరు, యుజేపురం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల వద్ద రెండు వైపుల ఉన్న గట్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ఈ గట్లు కోతకు గురికావడం వల్ల కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో ఉన్న యువకులు, విద్యార్థులు కోతకు గురైన గట్ల వద్ద కాలువలోకి దిగి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రెండు రోజుల క్రితం పెదశంకర్లపూడిలోని ఏలేరు కాలువలో నలుగురు విద్యార్థులు స్నానానికి దిగిన సంఘటనలో ఒక విద్యార్థి మరణించాడు. కాలువ గట్ల పటిష్టతకు ఏలేరు ఎడమ కాలువ అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ విద్యార్థులు, యువకులు వేసవిలో కాలువలో జలకలాడేందుకు ఆసక్తి చూపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువ గట్ల వద్ద పహరా ఉంచడంతో పాటు యువత జాగ్రత్తగా ఉంటే కొంతవరకు ప్రమాదాలు నివారణ సాధ్యపడేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పెదశంకర్లపూడిలో ప్రమాదకరంగా మారిన ఏలేరు ఎడమ కాలువ గట్టు

పదో తరగతిలో అడుగుపెట్టకుండానే ప్రాణాలు వదిలి..

ఏలేరు కాలువలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



విఘ్నేష్ మృతదేహం



మృతదేహాన్ని కాలువలో వెలికితీస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని ఏలేరు కాలువలో గల్లంతైన 9వ తరగతి విద్యార్థి విఘ్నేష్ (14)మృతదేహం బుధవారం లభ్యమైంది. పెదశంకర్లపూడికి చెందిన నలుగురు విద్యార్థులు సరదగా ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ఘటనలో వంది వీర వెంకట సత్యనారాయణ విఘ్నేష్ గల్లంతై మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడిన విషయం తెలిసిందే. గల్లంతైన విద్యార్థి విఘ్నేష్ కోసం బుధవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. కాలువ అడుగుభాగంలో చిక్కుకుపోయిన విఘ్నేష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు విఘ్నేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. లంపకలోవ జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవాల్సిన తమ కుమారుడు ఏలేరు కాలువ పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికందివచ్చే బిడ్డ ఏలేరు కాలువకు బలి కావడం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్‌లో...

బ్యాటరీ కారు ఢీకొని లోకో పైలట్‌కి గాయాలు



ఆస్పత్రిలో రామారావు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్ ఢీకొని లోకో పైలట్ గాయాల పాలయ్యాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో లోకోపైలట్‌గా పనిచేస్తున్న రాజమండ్రి లలితానగర్‌కి చెందిన రామారావు విధుల ముగించుకుని రెండో ప్లాట్‌ఫాం నుంచి ద్విచక్రవాహనం తీసుకుందామని వస్తున్నాడు. ఈలోపు మూడో ప్లాట్‌ఫాం నుంచి వస్తున్న బ్యాటరీ కారు ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు ఎముకకు గాయమైంది. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని ఎస్ఐ లోవరాజు తెలిపారు. అయితే ఇక్కడ ప్లాట్‌ఫాంలు రద్దీ సమయంలో ఇరుగ్గా ఉండడంతో ఇబ్బంది ఏర్పడుతోంది. 2,3,4 ప్లాట్‌ఫాంల నుంచి మెయిన్ గేటు వైపునకు ప్రయాణికులను తీసుకురావాలంటే కచ్చితం గా ఆ ప్లాట్‌ఫాంల చివరన రైలు ట్రాకులు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రైలు వెళ్లే సమయంలో బ్యాటరీ కారుకు పొరబాటున బ్రేకులు పడకపోతే ప్రమాదం ఊహించని విధంగా ఉంటుందని ప్రయాణికులు వాపో తున్నారు. విజయవాడ మాదిరిగా ఇక్కడ ప్రస్తుతం బ్యాటరీ కారు నడపడానికి భద్రతాపరంగా అనుకూలం కాదని.. ఓ వైపు కుక్కలు, మరో వైపు బ్యాటరీ కారుతో రద్దీ సమయంలో గందరగోళానికి గురవుతున్నామని చెప్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాకినాడ జిల్లా తుని పట్టణం బాలయోగి మెట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతిచెందిన వ్యక్తి శరీరం గుర్తుపట్టలేనంతగా మారడంతో వివరాలు కానరాలేదన్నారు. శవాన్ని ఏరియా ఆసుపత్రిలో మృతదేహం భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

మహిళపై హత్యాయత్నం

16 గంటలు అచేతనస్థితిలో తుప్పల్లో ఉండిపోయిన వైనం

అమలాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలోని నడక్ రోడ్డులో ఓ మహిళ తుప్పల్లో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లవరం మండలం మొల్లేటిమెరకకు చెందిన మంగాదేవి(30) స్థానిక నడక్ రోడ్డులో గల తుప్పల్లో పడి ఉండడాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 16గంటల పాటు తుప్పల్లో ఆమె అచేతన స్థితిలో ఉంది. పోలీసులు ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోసంగివారిపేటకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి తనను తీసుకెళ్లి దాడి చేసి హత్యాయత్నం చేసినట్టు ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన మహిళ పోలీసులకు తెలిపింది. అల్లవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది.

జేసీబీ, లారీ సీజ్

రౌతులపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ములగపూడి సర్వేనెంబర్1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు చేసి జేసీబీ, లారీ సీజ్ చేసినట్టు టెక్నికల్ అసిస్టెంట్ తేజ తెలిపారు. సర్వే నిమిత్తం రాగా అక్రమ గ్రావెల్‌ను గుర్తించామన్నారు. క్రషర్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న కే.అరుణ్‌కుమార్‌కు చెందిన వాహనాలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఆయన చెప్పారు.

అన్నవరం దేవస్థానం

మాస్టర్‌ప్లాన్‌ను పునఃపరిశీలన చేయాలి

- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు
- ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు
- విష్ణుసదన్ సత్రం వద్ద నూతనంగా నిర్మించదలిచిన ప్రదేశానికి స్థల పరిశీలన

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఏటేటా పెరుగుతన్న భక్తుల తాకిడికి అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పాత మాస్టర్‌ప్లాన్‌ను రివైజ్ చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. బుధవారం అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో విజయవాడ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న మాస్టర్‌ప్లాన్ 2019లో అప్రూవల్ కాగా దానికి విరుద్ధంగా పలు నిర్మాణాలను చేపట్టాల్సి వచ్చింది. దీంతో రివైజ్ చేయాలని ఏమేమి నిర్మించాలి, ఎక్కడ నిర్మించాలి అనే అంశాలపై నూతన మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. సీతారామసత్రం కూల్చివేత, విష్ణుసదన్ ఎదురు గా నూతనంగా నిర్మించతలపెట్టిన 128 గదుల సత్రాన్ని దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ స్థల పరిశీలన చేయాలని సూచించారు. ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు పిలవడం జరుగుతుందని సూత్రప్రాయంగా తెలిపారు. దేవదాయ కమిషనర్ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ఆయన పలు సూచనలు చేశారు. సమావేశానికి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, నూకరత్నం, డీఈలు రాంబాబు,ఉదయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

ఏపీ పాలిసెట్‌లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

అభినందనలు తెలిపిన చైర్మన్

రాజమహేంద్రవరంరూరల్ మే 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకుగాను 120 మార్కులు ఆరుగురు విద్యార్థులు బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ సాధించారు. 119 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతో పాటు 50 లోపు 14మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79మంది విద్యార్థులు సాధించారన్నారు. ర్యాంకుల సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్స్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

'ఏలేరు'లో భారీగా తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజక వర్గాల పరిధిలో సుమారు 60వేల ఎకరాలు వ్యవసాయ భూములున్నాయి. సాగుకు పూర్తిగా సరఫరా నిలిపి వేసి విశాఖ మహానగరం అవసరాలకు జలాలను సరఫరా చేస్తున్నారు. దీంతో ఏలేరులోని దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా శనివారం 76.51 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వల సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.71 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి.

అడుగంటిన తిమ్మరాజు చెరువు

ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఏలేశ్వరం గ్రామీణ మండలాల్లో ఏలేరు జలాలనే శుద్ధి చేసి తాగునీటిగా అందిస్తున్నారు. పశువుల తాగునీటి అవసరాలకు కాలువలకు అ ప్పుడప్పుడు నీటిని విడుదల చేస్తారు. ఎండలు మరింత అధికమైతే నీరు ఆవిరి అయిపోవడంతో నిల్వలపై ప్రభావం చూపుతోంది.



ఏలేరు జలాశయంలో తగ్గిన నీటి మట్టం

ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు సాగు నీరందించే తిమ్మరాజు చెరువు అడుగంటడంతో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలేరు జలాశయం నుంచి సుమారు 50 నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. దీనిలో అర టీఎంసీ నీరు నిల్వ ఉంటుంది. చెరవు నుంచి వచ్చే నీటి ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందిచవచ్చు. కానీ పొలాలకు నీరందించే కాలువలో పూడిక, తుప్పలు తొలగించకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లోను, ఇళ్ల మధ్యలోను ఎక్కడిక్కడ నీరు ఉండిపోవడంతో చెరువులోని నీరు పొలాలకు చేరకుండా మధ్యలో ఆగిపోతుంది. ఖరీఫ్ సాగు ముందు కాలువలను శుభ్రం చేసి పొలాలకు నీరందేలా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అడుగంటిన తిమ్మరాజు చెరువు దృశ్యం

రెండు లారీలు ఎదురెదురుగా ఢీ

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. బుధవారం ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ ఆలయ సమీపంలో గోదావరి గట్టుపై కొవ్వూరు వైపు నుంచి తాళ్ళపూడి వెళ్తున్న ఇసుకలోడ్ టిప్పర్ లారీ, తాళ్లపూడి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌కి స్వల్పగాయాలు కాగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో కొవ్వూరు తాళ్ళపూడి గోదావరి ఏటిగట్టు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆరికిరేవుల జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను ఆరికిరేవుల గ్రామంలోంచి బయటకు మళ్లించారు. పోలీసు, ఫైర్ అధికారులు, జేసీబీ సహాయంతో లారీ క్యాబిన్‌లో ఇర్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.





డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం, సంఘటనా స్థలంలో లారీలు

కనుల పండువగా భావనారాయణస్వామి తెప్పోత్సవం

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఎనిమిది రోజులుగా శోభాయమానంగా జరుగుతున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆలయం ఎదురుగా గల ముక్తికా సరస్సులో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్ప (హంస వాహనం)పై స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరిస్తుండగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి పులకించారు. తొలిసారిగా తెప్పోత్సవం నిర్వహించిన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఈవో లక్ష్మీనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





సర్పవరంలో హంస వాహనంపై భావనారాయణస్వామి తెప్పోత్సవం, తిలకిస్తున్న భక్తులు

అమలాపురం

దోమల నివారణకు చర్యలు

ముమ్మిడివరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలమ్మచెరువు యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్) బుధవారం తిల్లమ్మచెరువు, బళ్లగేటు సెంటర్, మార్కెట్ ప్రాంతాల్లో, ఆరు వసతిగృహాల్లో దోమల మందును పిచికారీ చేయించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఈశ్రమ్‌కార్డులు తీసుకోండి

మండపేట, మే14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హమీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బందితో మండపేట కార్మికశాఖాధికారి కాశి శివనాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. అర్హత కలిగిన సిబ్బంది, కార్మికులు అంతా ఈశ్రమ్ కార్డుల కోసం రూ.110 చెల్లించి వాటిని పొందాలన్నారు. ఎంపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

రూ.13కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని పద్దెనిమిది పుష్కర ఘాట్‌లను రూ.13కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. మండలంలోని దిండి, రామరాజులంకల్లో గల పుష్కర ఘాట్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2027లో గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలనే ఆలోచనలో ఉందన్నారు. నియోజకవర్గంలో 18 ఘాట్‌లను ఇప్పటికే గుర్తించామని, ప్రజల అభిప్రాయాల మేరకు కొత్తగా ఏవైనా ఉంటే వాటిని కూడా గుర్తించి ప్రభుత్వం దృష్టికి పంపుతామన్నారు. సోంపల్లి పుష్కర ఘాట్‌కు రూ.1.8కోట్లు, రాజోలులోని రెండు పుష్కర ఘాట్‌లకురూ.80 లక్షలు, దిండి ఘాట్‌కు రూ.50లక్షలు, రామరాజులంకకు రూ.40లక్షలు, అప్పనరామునిలంకకు రూ.48లక్షలు, సఖినేటిపల్లికి రూ.25లక్షలు, అంతర్వేదికి రూ.కోటి, పల్లిపాలేనికి రూ.20లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. పర్యటనలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, అడబాలయుగంధర్, ముదునూరి శ్రీనివాసరాజు, బొరుసు ఉమారావు, దేశినీడి తాతాజీ, ఉంగరాల బాలాజీ, ముద్దల శ్రీను పాల్గొన్నారు.



మలికిపురం: రామరాజులంకలో పుష్కరఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ తదితరులు

రూ.4.4కోట్లతో ప్రతిపాదనలు

అంతర్వేది, మే 14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో పుష్కర ఘాట్ల అభివృద్ధికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనల మేరకు రూ.4.4కోట్లతోప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినట్టు హెడ్‌వర్క్స్ ఏఈ మూర్తి బుధవారం తెలిపారు. రాబోయే 2027 పుష్కరాలకు సఖినేటిపల్లి మండలంలో 12ఘాట్లు ఉండగా, అంతర్వేదిలో ఉన్న మూడు పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.కోటి 68లక్షల ప్రతిపాదనలు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం పుష్కర ఘాట్లు ఆధునికీకరణ చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తు ప్రతిపాదనలు చేస్తున్నట్టు హెడ్‌వర్క్స్ ఏఈ తెలిపారు. రాజోలు నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

ఘాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే దేవ

రాజోలు, మే 14(ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో సోంపల్లి, రాజోలు పుష్కర ఘాట్లను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం పరిశీలించారు. పంచాయతీరాజ్ హెడ్‌వర్క్స్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. రాబోయే పుష్కరాలను మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘాట్ల విస్తీర్ణాన్ని పెంచడం, సదుపాయాలు మెరుగు పరచడం, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రాజోలు మండలం సోంపల్లి పుష్కర ఘాట్, రాజోలులో రెండు పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.8కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, మొల్లేటి నాగరాజు, కడలిమోహన్, పామర్తి రమణ, అడబాల విజయ్, రావి మురళీ, కుంపట్ల చిన్నారి, సర్పంచ్ యిందుకూరి శ్రీనివాసరాజు, గోనిపాటి రాజు, అడబాల యుగంధర్ పాల్గొన్నారు.

వేసవిలోనైనా రైతుల సమస్యలు తీరేనా!

- మలికిపురంలో శేషారాయుడు కాల్వపై శిథిలమైన డ్యామ్
- ముంపునీటితో వరిచేలన్నీ జలమయం



శేషారాయుడు కాల్వపై మలికిపురంలో శిథిలమైన డ్యామ్

మలికిపురం, మే 14(ఆంధ్రజ్యోతి): వేసవిలో కాల్వలు కట్టిన సమయంలో కాల్వలు మరమ్మతులు చేస్తారని రైతులు ఆశించారు. కానీ రైతుల ఆశయాలకు, ఆలోచనలకు విభిన్నంగా ప్రభుత్వం జలవనరుల శాఖ ముందుకు వెళ్లడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. దశాబ్ద కాలం నుంచి మరమ్మతులకు నోచుకోని పంటకాల్వలకు కూటమి పాలనలో మహర్దశ పడుతుందని ఆశించారు. కానీ ఈవేసవిలో రాజోలు డీసీ పరిధిలో కేవలం కొన్ని కాల్వల పూడికతీతలకు నిధులు మంజూరు చేయడంతో నిర్ఘాంతపోయారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో 3300ఎకరాల రిజిష్టర్ ఆయకట్టు ఉండగా కేవలం 10వేల ఎకరాల్లోనే రైతులు దాళ్వా సాగు చేపట్టారు. దాళ్వా కైతే డ్రెయిన్ల ముంపు, కాల్వల అధ్వాన పరిస్థితితో చాలా వరకు నాట్లు వేయడం మానేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అధికారంలోకి వచ్చాక సాగు విస్తీర్ణాన్ని పెంచడం కోసం పలుమార్లు సమావేశాలు ఏర్పాటుచేశారు. రైతులను ప్రోత్సహించారు. వేసవిలో కాల్వల మరమ్మతులు చేసుకుందామని అన్నారు. రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో ఏడు సంఘాలు ఉండగా మలికిపురం 9, గొంది, అంతర్వేది సంఘాలకు పూడికతీతలకు నిధులు మంజూరు చేయలేదు. ఈ కాల్వల పరిధిలో సుమారు 9వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అధికారులు అనాలోచితంగా అన్ని సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొన్ని సంఘాల పరిధిలోని కాల్వలకు మాత్రమే నిధులు మంజూరు చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మలికిపురం కాల్వ పరిధిలోని శేషారాయుడు కాల్వ వేంకటేశ్వరస్వామి గుడి వద్ద డ్యామ్ ఇనుప తలుపులు పాడవడంతో వరి సాగు సమయంలో కాల్వ ముంపునీటితో వరిచేలన్నీ జలమయం అవుతున్నాయి. ఈవేసవిలోనైనా ఈడ్యామ్ షట్టర్లు బాగు చేస్తారని రైతులు ఆశించారు. కానీ మలికిపురం నీటిసంఘం పరిధిలోని ఈడ్యామ్‌కు గానీ, గుడిమెళ్లంక వద్ద మోరి కాల్వపై ట్రఫ్‌కు గానీ నిధులు మంజూరు చేయకుండా ఉండడంతో రైతులు నిరుత్సాహపడ్డారు. అధికారులు ఇప్పటికైనా వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈవిషయమై రాజోలు ఇరిగేషన్ ఏఈఈ రమేష్‌ను వివరణ కోరగా ఖరీఫ్ నుంచి రబీ ముగింపు వరకు రాజోలు ఇరిగేషన్ పరిధిలోని 16పనులకు రూ.62లక్షలు మంజూరైందన్నారు. ఈనిధులతో కాల్వల్లో ఏడాది కాలం పాటు చెత్తా చెదారం తొలగిస్తూ శివారు రైతులకు నీరు అందిస్తామన్నారు. శేషారాయుడు కాల్వపై డ్యామ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు కోసం పంపిస్తామన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

అంబాజీపేట, మే14(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతాలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి.గన్నవరం నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ సంపద కేంద్రాల ద్వారా నాణ్యమైన సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. వాటిని విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రతి గ్రామంలో సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచే విధంగా కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇంటి పన్నులు నూరుశాతం వసూళ్లకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో బొజ్జిరాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో భీమారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎంఏజేవై పథకంలో రూ.60లక్షల నిధులు

పి.గన్నవరం, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన పథకంలో మండలంలోని మూడు గ్రామాలకు రూ.60 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. ఎస్సీ జనాభా 50 శాతం దాటిన గ్రామాలను ఈనిధులకు ఎంపిక చేస్తారని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి నరేంద్రపురం, వై.కొత్తపల్లి, ఉడిమూడి గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. గ్రామానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు అందజేస్తారని చెప్పారు. ఈనిధులతో గ్రామంలోని ఎస్సీ ఏరియాలో రహదారులు, డ్రైన్లు, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు తదితర అభివృద్ధి పనులు చేసుకోవచ్చునని చెప్పారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, సంబంధిత అధికారులకు పనులు గుర్తించాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు.

రాజోలు పంచాయతీరాజ్ డీఈఈగా కృష్ణంరాజు



రాజోలు, మే 14(ఆంధ్రజ్యోతి): రాజోలు పంచాయతీరాజ్ డీఈఈగా కేవీ కృష్ణంరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పి.గన్నవరం డీఈ డి.చంద్రశేఖర్ రాజోలు పీఆర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. మామిడికుదురు మండల ఏఈగా పనిచేస్తున్న కృష్ణంరాజు రాజోలు డీఈఈగా నియమితులయ్యారు. పంచాయతీరాజ్ శాఖలో రోడ్డు నిర్మాణంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని సకాలంలో పనులు పూర్తయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. డీఈఈగా బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజును ఏఈలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడిపై కేసు

ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయమాటలతో యువతిని మోసంచేసిన యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్‌ఎస్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.జల్వాసాగర్ తెలిపారు. గాడిలంక గ్రామానికి చెందిన యువతితో ఐ.పోలవరం మండలం పశువుల్లంక గ్రామానికి చెందిన చింతా సురేష్ ప్రేమ పేరుతో మోసం చేశాడని, పెళ్లి చేసుకోమంటే కులాలు వేరని పెళ్లికి ఇంట్లో వాళ్ల ఒప్పుకోడం లేదని సురేష్ మొహం చాటేయడంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమలాపురం డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం పరిశీలన

ఉప్పలగుప్తం, మే 14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఓఎన్జీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో సరిపల్లిలో ఏర్పాటుచేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని బుధవారం తహశీల్దార్ వాసా వీఎస్ దివాకర్ పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గెడ్డం స్వరూపాసురేష్‌బాబు శిక్షణా కేంద్రం వివరాలను తహశీల్దార్‌కు వివరించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో తహశీల్దార్ మాట్లాడారు. శ్రద్ధతో కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆయన మహిళలకు సూచించారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ

యానాం, మే 13(ఆంధ్రజ్యోతి): యానాం పరిధిలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం 10, 12వ తరగతి సీబీఎస్ఈ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత నమోదు చేసుకుందని ప్రిన్సిపాల్ ఎన్.కీర్తి తెలిపారు. 10వ తరగతి విద్యార్థి బండారు దుర్గేశ్ కనకరావు, చిత్తూరి శ్రీవిద్య, ఎం.షణ్ముఖవర్ధినిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 12వ తరగతిలో వై.యోగలక్ష్మీ, టి.డి కౌశిక్, డి.మీనాక్షి శశిరేఖలు, జి.దివ్యానుష్, సి.రాజులు ప్రతిభ కనబరచడం జరిగిందన్నారు. 12వతరగతిలో 32మంది విద్యార్థులకు 30మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు.

వైభవంగా గజవాహన సేవ



బండారులంకలో గజవాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

అమలాపురం రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం బండారులంకలోని బిళ్లవారి వీధిలో ఉన్న శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుమలేశునికి గజవాహన సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ గోవింద నామస్మరణలతో వైభవంగా జరిగింది. వీధుల్లో గ్రామోత్సవానికి హారతులు పట్టారు. ఆలయ అర్చకులు బీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో బిళ్ల విశ్వేశ్వరరావు-లక్ష్మీకుమారి దంపతులతో స్వామివార్లకు విశేష పూజాభిషకాలు నిర్వహించారు. రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన వైభవంగా జరిగింది.

డిప్యూటీ స్పీకర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



అమలాపురం, మే 14(ఆంధ్రజ్యోతి): భీమవరంలోని కన్వెన్షన్ హాలులో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును బుధవారం క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ ప్రభుత్వంలో ఉన్నత విలువలతో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని సత్తిబాబురాజు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

మలికిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ కోరారు. బుధవారం వుయ్యూరివారి మెరకలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలల హక్కుల రక్షణపై అందరిలో చైతన్యం తీసుకురావడానికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, అంగన్వాడీ వర్కర్లు ఎస్తేరు, కె.రత్నకుమారి, నందిని, నాగమ్మ, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ టెండర్లు ఎస్సీలకే కేటాయించాలి

మలికిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో చేసే అభివృద్ధి పనులు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్‌కు అవసరమయ్యే సరుకుల సరఫరా టెండర్లను దళితులకే కేటాయించాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. బుధవారం శంకరగుప్తంలోచింతా సత్య ఇంటి వద్ద జరిగిన సమావేశంలో విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ సక్రమ అమలు కోసం ప్రభుత్వం ఎస్టీఎస్ అనే కొత్తస్కీమును ప్రవేశపెట్టాలన్నారు. ఎన్.ప్రసాదరావు, ఎం.సత్యనారాయణ, ఆర్.రత్నరాజు, బూసి జాన్ మోషే, విప్పర్తి సాయిబాబు, చవ్వాకుల వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నిఘంటువులు అందించిన జేసీ



అమలాపురం టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని జాయింట్ కలెక్టర్ నిశాంతి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు జేసీ నిఘంటువులు బహూకరించి వారిని సన్మానించారు. విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నారనే విషయంపై ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారి వనుము సోమశేఖరరావు, డీఈవో షేక్‌సలీంబాషా, పబ్లిక్ పరీక్షల సూపరింటెండెంట్ హనుమంతరావు, ఉప విద్యాశాఖాధికారి జీవీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, మే 14 (ఆంధ్రజ్యోతి): అనాతవరానికి చెందిన పేరూరి మహాలక్ష్మి అనాతవరం సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆమెకు పార్టీ సభ్యత్వం ఉన్నందున ప్రమాద బీమా రూ.5లక్షలు మంజూరైంది. ఆ మొత్తం చెక్కును ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, అర్ధాని శ్రీనివాసరావు, దాట్ల పృథ్విరాజ్, కురసాల శివబాబు, మిమ్మితి చిరంజీవి, శీలం వెంకటేశ్వరరావు, పేరిచర్ల సురేష్‌రాజు, పెయ్యల వెంకటరమణ, అందే శ్రీను, యిళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింహాచలం బాధిత కుటుంబాలకు వైసీపీ సాయం

అంబాజీపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలో గోడ కూలిన ఘటనలో అంబాజీపేట కొర్లపాటివారిపాలానికి చెందిన పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల ఈశ్వరమణికంఠ శేషారావు మృతిచెందారు. వైసీపీ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలకు సాయం ప్రకటించిన నేపథ్యంలో రూ.2లక్షల చొప్పున బుధవారం వైసీపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోట బేబీరాణి, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నాయకులు పి.కె.రావు, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, సుదాబత్తుల రాము పాల్గొన్నారు.

యువత సేవాభావం అలవరుచుకోవాలి: ఎంపీ హరీష్



వైద్యశిబిరంలో మందులు, రోగనిర్ధారణ పరికరాలను పరిశీలిస్తున్న ఎంపీ హరీష్

ఉప్పలగుప్తం, మే 14(ఆంధ్రజ్యోతి): యువత సేవాభావాన్ని అలవరచుకుని, సమాజంలో పేద వర్గాలకు ఉపయోగపడే కార్యక్రమాలు చెయ్యాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. కూటమి నాయకుడు నల్లా అజయ్ జన్మదిన సందర్భంగా నల్లా సూర్యచంద్రరావు సేవాసమితి ఆధ్వర్యంలో గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన గుండె, మధుమేహ వ్యాధుల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. శ్రీవెంకటసందీప్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య సేవలందించారు. నారాయణరెడ్డి పీవీఆర్ ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 225మందికి ఎకో, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నల్లా అజయ్, అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఇసుకపట్ల రఘుబాబు, కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, చిక్కం సుధాసూర్యమోహన్, ఆకుల బుజ్జి, మద్దింశెట్టి ప్రసాద్, సలాది నాగరాజు, ఆకుల సూర్యనారాయణమూర్తి,రవణం మధు, గనిశెట్టి అరవింద్, మంచెం బాలకృష్ణ, గుత్తాల సుభాష్‌చంద్రరావు పాల్గొన్నారు.

'చెరువు తవ్వకాలు నిలుపుదల చేయాలి'

ముమ్మిడివరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక 14వ వార్డు చిప్పలపాలెంలో కొంతమంది అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని, వాటిని వెంటనే నిలుపుదల చేయాలని ఆ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు బుధవారం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో పచ్చని మాగాణి పంట పొలాల్లో ఆక్వా చెరువులు తవ్వకాలు చేపట్టారని దీని వల్ల భవిష్యత్తులో తమ పంట పొలాలన్నీ ఉప్పునీటి బారిన పడి సారవంతాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నగర పంచాయతీ వైస్‌చైర్మన్ వేటుకూరి బోసురాజు ఆధ్వర్యంలో పలువురు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

చిట్టిబాబుకు డాక్టరేట్



ముమ్మిడివరం, మే 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేథ్స్ లెక్చరర్, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తోన్న కందికట్ల చిట్టిబాబు అప్లైడ్ గణితంలో డాక్టరేట్ పొందారు. క్రిప్టోగ్రఫీ మెంబర్ థీయరీలో నోవెల్ క్రిప్టోగ్రఫిక్ టెక్నిక్స్ ఫర్ సెక్యూర్ ఆన్‌లైన్ ఓటింగ్ అండ్ యండ్ టూ యండ్ డేటా ఎక్స్ఛేంజ్ అనే అంశంపై చిట్టిబాబు చేసిన పరిశోధనకు విశాఖపట్నం గీతం యూనివర్శిటీ ఈఅవార్డు ప్రదానం చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తలారి సురేంద్ర, విశ్రాంత ప్రొఫెసర్ ఎ.చంద్రశేఖర్ రీసెర్చ్ గైడ్స్‌గా వ్యవహరించారు. చిట్టిబాబును డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా రాజేంద్ర

యానాం, మే 13(ఆంధ్రజ్యోతి): యానాం స్త్రీ శిశు సంక్షేమ శాఖలో అసిస్టెంట్‌గా సూరంపూడి రాజేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వశాఖలో పనిచేస్తోన్న 76మంది యూడీసీలను, అసిస్టెంట్లను ఇతర శాఖలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో యానానికి సంబంధించి షేక్‌షాబాజ్, పి.వినోద్‌కుమార్ - డిప్యూటీ కలెక్టర్లగా రెవెన్యూ, రాజేంద్ర-స్త్రీ శిశు సంక్షేమశాఖ, కె.సిద్ధార్థకుమార్- పౌర సరఫరాల శాఖ, ఎస్.వంశీకృష్ణ - విద్యాశాఖలో బాధ్యతలు స్వీకరించారు. యూడీసీ నుంచి అసిస్టెంట్లగా పదోన్నతి పొందిన సలాది వీవీఎల్ఎన్‌స్వామి, జి.వెంకటచైతన్య, బండారు సూర్యఅముక్తమాల్యద, పోతుల వెంకటేశ్వరి వారికి కేటాయించిన శాఖల్లో యానాంలో బాధ్యతలు స్వీకరించారు.

వినియోగదారుల జిల్లా ప్రొటెక్ట్ కౌన్సిల్ సభ్యుడిగా మాలే



మలికిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిల్ మెంబర్‌గా మాలే శ్రీనివాసనగేష్‌ను నియమిస్తూ కలెక్టర్ మహేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నగేష్ 15సంవత్సరాలుగా మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా, జిల్లా సంఘ సలహాదారునిగా వినియోగదారులకు వివిధ సేవలు అందిస్తున్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని నగేష్ చెప్పారు.

వేడుకగా అన్నమయ్య జయంత్యుత్సవాలు



కవులు, కళాకారులను సన్మానిస్తున్న సంస్కారభారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి కోనసీమ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురంలోని సుభద్రా నర్సింగ్ హోమ్‌లో తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీగిరి పద్మావతి అధ్యక్షతన కార్యక్రమం వైభవంగా జరిగింది. తొలుత అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ అయ్యగారి రాధిక వీణాగానం చేసి ప్రేక్షకులను అలరించారు. గొల్లకోట నాగకమల అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. సంగీత ప్రముఖ్ మట్టపర్తి చంద్రశేఖర్ అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి సభికులను ఉర్రూతలూగించారు. ఈమని సాయికృష్ణ మృదంగ సహకారం అందించారు. అనంతరం కళాకారులను సంస్కార భారతి సభ్యులు ఘనంగా సన్మానించారు. చిరంజీవి లహరికి బహుమతి అందించారు. కార్యక్రమంలో వీవీఆర్ నాయుడు, శ్రీగిరి గోపాలకృష్ణ, వేదనభట్ల సాయిలక్ష్మి, కళాపూర్ణారావు, యెండూరి సీత, భమిడిపాటి సుగుణేశ్వరి, గుర్రం రామకృష్ణారావు, పేరి లక్ష్మీనరసింహం, లలిత, నూకల సత్యనారాయణ పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ మండపానికి దాత చేయూత

రావులపాలెం, మే 14(ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ ఆలయ మండపానికి పులపర్తి ఎడ్యుకేషన్ ట్రస్టు అధ్యక్షుడు, రావులపాలెం వాసవీ క్లబ్ అధ్యక్షుడు పులవర్తి గోపాలకృష్ణమూర్తి రూ.40 వేలతో మండపానికి రేకులు వేయించారు. ఆయన్ను ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి సత్తిబాబు, ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ, గ్రామస్థులు అభినందించారు.

దోమల నివారణకు చర్యలు

ముమ్మిడివరం, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలమ్మచెరువు యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్) బుధవారం తిల్లమ్మచెరువు, బళ్లగేటు సెంటర్, మార్కెట్ ప్రాంతాల్లో, ఆరు వసతిగృహాల్లో దోమల మందును పిచికారీ చేయించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తజనం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.95 లక్షలు

ఆత్రేయపురం, మే 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,95,495 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలెం మండలం ఈతకోటకు చెందిన దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ కే.వర్మ, సుగుణావతి దంపతులు రూ.56,100 విరాళం ఇచ్చారు. దాతలకు ఉపకమిషనరు సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందచేశారు.

సమస్యల దరువు..పరిష్కారం కరువు

• అభివృద్ధికి ఆమడ దూరంలో లంక గ్రామాలు • కనీస సౌకర్యాలు కల్పించాలని వినతి • పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



నారాయణలంక వద్ద నిర్మించిన వంతెనకు రెయిలింగ్ లేని దృశ్యం

కపిలేశ్వరపురం, మే 14 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు లంక గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేదార్లంక, వీధివారి లంక, నారాయణలంక, పల్లపు లంక, అద్దంకివారిలంక గ్రామాల్లో సుమా రు 10 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. గౌతమి గోదావరి నదీపాయ సుమారు 2 కిలోమీటర్ల వెడల్పుతో వీటి మధ్య భూభాగాన్ని వేరుచేస్తోంది. దీంతో కేదార్లంక, నారాయణలంక గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కొత్త పేట, రావులపాలెం, జొన్నాడ, తాత పూడి మీదుగా సుమారు 25 కిలో మీటర్లు, అద్దంకివారిలంక నుంచి రావాలంటే సుమారు 50 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. మండల కేంద్రం నుంచి ఆయా లంక గ్రామా ల భూభాగం ఐనవిల్లి, కొత్తపేట మండలాల వరకు విస్తరించి ఉంది. జిల్లాల విభజన, డివిజన్ల ఏర్పాటుతో ఆయా లంక గ్రామాలు ఐనవిల్లి, కొత్తపేట మండలాల్లో విలీనం అవుతాయన్న ఆశ వారికి నిరాశను మిగిల్చింది. ముఖ్యంగా ఈ ప్రాం తాల్లో కొబ్బరి, మొక్కజొన్న, అరటి, కంద, పసుపు, పొగాకు, కూరగాయ లు తదితర పంటలు పండిస్తుం టారు. వరదల సమయంలో అయితే వాటి తరలింపు కష్టంగా మారుతుంది.

తాగునీటి కోసం అవస్థలు: నదీగర్భంలో ఉన్నా ఆయా లంక గ్రామాలకు దశాబ్దాలుగా రక్షిత మంచినీరు పూర్తిస్థాయిలో అందడంలేదు. సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న అయినవిల్లి మండలం తొత్తరమూడి నుంచి అద్దంకివారిలంక గ్రామానికి తాగునీరు సరఫరా అవుతుంది. గ్రామం ఎత్తులో ఉండటంతో కుళాయిల నీరు ధారాళంగా రాకపోవడంతో ప్రజలు పలు ఇబ్బం దులు పడుతున్నారు. గ్రామంలో 90వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు ఉన్నప్పటికీ సరిపడా నీరు అందడం లేదు. మరో రెండు ట్యాంకులు నిర్మిస్తే గాని నీటి సమస్య తీరదు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పనులు ప్రస్తుతం పల్లంపులంకలో ప్రారంభమయ్యాయి. కేదార్లంక, నారాయణలంక గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు ఉన్నప్పటికీ శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. సుమారు 5వేల జనాభా గల కేదార్లంక గ్రామంలో 70వేల లీటర్ల సామర్థ్యం గల మరో వాటర్ ట్యాంకు అవసరం ఉంది. ప్రస్తుతం లక్షా 50వేలు లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా వీధివారిలంక వరకు పనులు పూర్తయినప్పటికీ కేదార్లంకకు పనులు అవ్వాల్సి ఉంది. అయిదు అంగన్‌వాడీ సెంటర్లకు రెండు ప్రభుత్వ భవనాలు ఉండగా మరో 3 భవనాలు కట్టాల్సి ఉంది. అవి ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. పీహెచ్‌సీ ఉపకేంద్రం ఉన్నా సిబ్బందికి సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ వెంబడి మెయిన్‌డ్రైన్‌తో పాటు ఇంటర్నల్ డ్రైన్ ప్రధాన సమస్యగా ఉంది. బోడిపాలెం వంతెన నిర్మాణం అత్యవసరంగా చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై లంకవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు ఆర్టీసీ సర్వీసు లు లేకపోవడంతో గ్రామస్థులు, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ధనమ్మమర్రికి వచ్చే భక్తుల సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ లంక గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నప్పటికీ పైచదువుల కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది. వీరికి సరైన రహదారులు, రవాణా సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి లంక గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.



వాడపల్లిలంకలో ఎక్సైజ్ బృందం దాడుల్లో పట్టుబడిన బెల్లపుఊట

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ఆత్రేయపురం, మే 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లిలంకలో బుధవారం సారా తయారీ స్థావరాలపై జిల్లా ఎక్సైజ్ అధికారుల బృందం దాడులు జరిపారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 3,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో జి.అమరబాబు, సీఐలు నాగేశ్వరరావు, పి.సుబ్బారెడ్డి, ఎస్ఐలు కె.అన్నవరం, కె.సుబ్బారావు, బి.అప్పారావు, రామానుజ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కపిలేశ్వరపురం, మే 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి పాఠశాల విద్యార్థులకు కథలు చదవడం, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై 14వ రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

మండపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. మండపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఖరిని ఆయన తప్పుపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

సీవీ అరుణాచలం జయంతి

ద్రాక్షారామ(రామచంద్రపురం) మే 14(ఆంధ్రజ్యోతి): గణిత వైతాళికుడు ప్రొఫెసర్ సీవీ అరుణాచలం జయంతిని రామచంద్రపురం రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం జరిపారు. అకాడమీ వ్యవస్థాపకుడు కెవీవీ సత్యనారాయణ ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం అరుణాచలం చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి ఎం.నాగార్జున, రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణసాయి, పీవై వెంకట్రావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఏసీపీ అభినందనలు

రాయవరం, మే 14(ఆంధ్రజ్యోతి): రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏసీపీ జిల్లా అధికారిణి మమ్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిజిటల్ లైబ్రరీ, ఆటస్థలం వంటివి ఆమె పరిశీలించారు. టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆమె అభినందించారు. ఆమె వెంట మండల విద్యాశాఖా ధికారితో పాటు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్రమ్‌కార్డులు తీసుకోండి

మండపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బందితో మండపేట కార్మికశాఖాధికారి కాశి శివనాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. అర్హత కలిగిన సిబ్బంది, కార్మికులు అంతా ఈశ్రమ్‌కార్డుల కోసం రూ.110 చెల్లించి వాటిని పొందాలన్నారు. సమావేశంలో ఎంపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

రాయవరం, మే 14(ఆంధ్రజ్యోతి): వెదురుపాకలోని పడాల పెదరామిరెడ్డి జిల్లా పరిషత్‌లో 2000-2005 మధ్య టెన్త్ చదువుకున్న పూర్వపు విద్యార్థులు బుధవారం కలుసుకుని సందడి చేశారు. ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా అప్పటి పలు జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వపు విద్యార్థులు కె.దుర్గాకృష్ణారెడ్డి, నల్లమిల్లి కృష్ణవేణి, కర్రి అరుణ సారధ్యంలో దీన్ని నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు విరాళంగా రూ.10వేలను హెచ్‌ఎం రాంబాబుకు అందజేశారు. విశాఖ గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దంతులూరి శివరంజని, ఇస్రోలో క్వాలిటీ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్న యండ్ల దుర్గాప్రసాద్, పనలపూడి సహకార సంఘ సీఈవో సత్తి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గ్రేడ్5 కార్యదర్శులుగా పదోన్నతి

ఆలమూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నలుగురు సచివాలయ గ్రేడ్6 కార్యదర్శులకు గ్రేడ్5 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. ఇటీవల గ్రేడ్5 కార్యదర్శులు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కౌన్సెలింగ్‌లో వారికి గ్రేడ్5 స్థానాలను కేటాయించారు. బడుగువానిలంక గ్రేడ్6 కార్యదర్శి శివకుమార్ మడికి సచివాలయం4 కార్యదర్శిగా నియమించారు. నర్సిపూడి సచివాలయం1లో పనిచేసే హేమంత్‌కుమార్‌ను మూలస్థానం2కి నియమించగా చొప్పెల్ల 1లో పనిచేసే ప్రసన్నకుమార్‌ను ఆత్రేయపురం మండలం పులిదిండికి నియమించారు. పదోన్నతులు పొందిన కార్యదర్శులను ఆలమూరు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు తదితరులు అభినందించారు.